

కల్వకుర్తి అప్నా బజార్‌లో
అగ్నిప్రమాదం
» రూ 50లక్షల ఆస్తినష్టం 7


భక్తి శ్రద్ధలతో..
రంజాన్


కొల్లాపూర్‌లో ఈద్గా వద్ద శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు


నాగర్‌కర్నూల్‌లో ఈద్గా వద్ద నమాజ్ చేస్తున్న ముస్లింలు


గద్వాల ఈద్గా వద్ద శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి


గద్వాల ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


వనపర్తిలో ఈద్గా వద్ద ప్రార్థన చేస్తున్న చిన్నారులు

రంజాన్ ఉపవాస దీక్షలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ముస్లింలు రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లా కేంద్రాలతో పాటు నియోజకవర్గ కేంద్రాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంత్రి, ఎమ్మెల్యేలు ఈద్గాల వద్దకు చేరుకొని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కొల్లాపూర్ పట్టణంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తిలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు, నాయకులు ఈద్గాల వద్దకు చేరుకొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.
- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్


నాగర్‌కర్నూల్: శుభాకాంక్షలు తెలపుతున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి


వనపర్తి పట్టణంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


మానవపాడు మసీదు వద్ద ప్రార్థన చేస్తున్న బాలిక


అమరచింత ఈద్గా వద్ద సందేశం ఇస్తున్న మౌలానా అల్తాఫ్ బేగ్


ఆత్మకూరులో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


అలంపూరు : గార్లపాడులో ప్రార్థన చేస్తున్న ముస్లింలు


కల్వకుర్తి ఈద్గా వద్ద శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

పంచాయతీలకు
నిధుల కట కట
» ప్రత్యేక పాలనలో సాఫీగా సాగని పాలన
» నిధులు లేక నిలిచిన అభివృద్ధి పనులు
» జీతాలు అందక ధర్నాలకు దిగుతున్న సిబ్బంది 6



నేటి నుంచి
ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు 6

కష్టాలను అధిగమించి..
లక్ష్యాన్ని సాధించి..
- గ్రూప్-1లో సత్తా చాటిన ఉమ్మడి పాలమూరు యువత 7



ముగిసిన ఎల్ఆర్ఎస్
రాయితీ గడువు

● నేటి నుంచి 25 శాతం రాయితీ లేకుండా చెల్లింపులు
● గడువు పొడిగింపు లేకపోవడంతో నిరుత్సాహం
● ఉమ్మడి జిల్లాలో 22,959 దరఖాస్తులకు ఫీజులు
● రూ.48.78 కోట్ల ఆదాయం



మహబూబ్‌నగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్(లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) రాయితీ గడువు ముగిసింది. ప్రభుత్వం గడువు మళ్లీ పొడగిస్తుందని ఆశించిన వారి ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. మంగళవారం నుంచి 25 శాతం రాయితీ లేకుండా ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. చివరి రోజు సోమవారం దరఖాస్తుదారులు ఫీజు చెల్లించేందుకు అధిక సంఖ్యలో ముందుకొచ్చారు. ఉమ్మడి జిల్లాలోని 20 మునిసిపాలిటీలు, ఓ కార్పొరేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం 5 గంటల వరకు 22,959 దరఖాస్తులకు సంబంధించి ఫీజులు చెల్లించారు. వాటి ద్వారా రూ.48.78 కోట్ల ఆదాయం సమకూరింది. సాయంత్రం 5 గంటల తరువాత కూడా కొన్ని వందల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. వాటి ద్వారా మరో రూ.3 నుంచి రూ.4 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

దరఖాస్తులు ఇలా..

మహబూబ్‌నగర్ జిల్లాలో 7,498 దరఖాస్తులు వచ్చాయి. మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో 4,049 దరఖాస్తులు, జడ్చర్లలో 1,824, భూత్పూర్‌లో 1,075, దేవరకద్రలో 550 దరఖాస్తులు వచ్చాయి. కోస్గిలో 781, నారాయణపేటలో 1,233, మద్దూర్‌లో 240, మక్తల్‌లో 739, ఆత్మకూర్‌లో 573, పెబ్బేరులో 1,162, కొత్తకోటలో 1,038, అమరచింతలో 157, వనపర్తిలో 3,218, కొల్లాపూర్‌లో 480, అచ్చంపేటలో 1,359, కల్వకుర్తిలో 1,150, నాగర్‌కర్నూల్‌లో 1,046, అయిజలో 749, గద్వాలలో 1,248, అలంపూర్‌లో 99, వడ్డేపల్లిలో 189 దరఖాస్తులు వచ్చాయి.

ఆదాయం ఇలా..

మహబూబ్‌నగర్ జిల్లాకు రూ.20.99 కోట్ల ఆదాయం వచ్చింది. నారాయణపేటకు రూ.5.51 కోట్లు, వనపర్తికి రూ.8.38, నాగర్‌కర్నూల్‌కు రూ.9.94, జోగుళాంబ గద్వాలకు రూ.3.96 కలిపి మొత్తం రూ. 48.78 కోట్ల ఆదాయం సమకూరింది.

పది మూల్యాంకనానికి ఏర్పాట్లు

» 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహణ
» మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌లో కేంద్రాలు
» రెండు కేంద్రాలకు కలిపి రానున్న 3.83 లక్షల జవాబు పత్రాలు
» పేపర్లు దిద్దేందుకు 1,225 మంది ఉపాధ్యాయుల నియామకం
» వారికి త్వరలో ఉత్తర్వులు
» కొనసాగుతున్న డీ కోడింగ్ ప్రక్రియ


మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లోని మూల్యాంకనం కేంద్రానికి వచ్చిన జవాబు పత్రాలను పరిశీలిస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు కొనసాగనుంది. అందుకు సంబంధించి ఉమ్మడి మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. మహబూబ్‌నగర్ కేంద్రం ఇన్‌చార్జిగా డీఈవో ప్రవీణ్‌కుమార్, సహాయ ఇన్‌చార్జిలుగా బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మొరజూల్లా ఖాన్, పరీక్ష విభాగం అధికారి కమలాకర్, నాగర్‌కర్నూల్ కేంద్రం ఇన్‌చార్జిగా డీఈవో రమేష్ వ్యవహరించనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీకేరెడ్డి కాలనీలో గల మహబూబ్‌నగర్ గ్రామర్ ఉన్నత పాఠశాలలో, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో మూల్యాంకనం నిర్వహించనున్నారు. పరీక్షలు బుధవారంతో ముగియనున్నాయి. చివరి పరీక్ష సాంఘిక శాస్త్రం మాత్రం మిగిలింది. పూర్తయిన తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ, గణితం, భౌతిక, రసాయన శాస్త్రాలకు సంబంధించిన జవాబు పత్రాలు ఆయా జిల్లాలకు చేరుకోగా, కొన్ని రావాల్సి ఉంది. రెండు కేంద్రాల్లో 3.83 లక్షల జవాబు పత్రాలను మూల్యాంకనం చేయనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు 2.50 లక్షల జవాబు పత్రాలు రానుండగా, నాగర్‌కర్నూల్‌కు లక్షా 33,391 జవాబు పత్రాలు రానున్నాయి.

వివిధ జిల్లాల నుంచి జవాబు పత్రాల రాక

రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన జవాబు పత్రాలకు విద్యాశాఖ అధికారులు డీ కోడింగ్ చేస్తున్నారు. ఇక్కడికి వచ్చిన పత్రాలు ఏ జిల్లావో తెలియకుండా అధికారులు సూచించిన నెంబరు ఇచ్చి, కంప్యూటరీకరణ చేస్తున్నారు. అందుకు 80 మందిని నియమించారు. వారితోపాటు నలుగురు కోడింగ్ అధికారులు, 12 మంది సహాయ కోడింగ్ అధికారులను నియమించగా, ప్రక్రియ చురుకుగా సాగుతోంది.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ నెల 7 నుంచి ప్రక్రియ ప్రారంభం కానుంది. మహబూబ్‌నగర్ కేంద్రంలో మహబూబ్‌నగర్ జిల్లా ఉపాధ్యాయుల తోపాటు, నారాయణపేట, గద్వాల జిల్లాల ఉపాధ్యాయులు 641 మంది విధుల్లో పాల్గొననున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన జవాబు పత్రాలకు డీకోడింగ్ ప్రక్రియ కొనసాగుతోంది.
- ఏ ప్రవీణ్‌కుమార్, డీఈవో మహబూబ్‌నగర్

7 నుంచి జవాబు పత్రాల మూల్యాంకనం

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు మూల్యాంకనం చేయనున్నారు. సహాయకులుగా, కౌంటింగ్ తదితర పనుల కోసం సెంకండరీ గ్రేడ్ టీచర్స్, పీడీలు, పీఈటీలు మొత్తం 641 మంది విధులు నిర్వర్తించనున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్స్, సెంకండరీ గ్రేడ్ టీచర్లు, పీడీలు, పీఈటీలు మొత్తం 584 మంది పని చేయనున్నారు. మూల్యాంకనం కోసం ఎంపికైన ఉపాధ్యాయులకు రెండు మూడు రోజుల్లో ఉత్తర్వులు ఇవ్వనున్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని మూల్యాంకనం కేంద్రాల గదుల్లో ఫ్యాన్లు, కూలర్లు, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు.

కన్వేయర్ బెల్టు
పునరుద్ధరణ వేగవంతం

- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రత్యేక అధికారి శివశంకర్


సొరంగంలోని కన్వేయర్ బెల్టు

నాగర్‌కర్నూల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదం జరిగిన ప్రదేశం వద్ద సహాయక చర్యలు, కన్వేయర్ బెల్టు పునరుద్ధరణ పనులను వేగవంతం చేశామని టన్నెల్ ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. సోమవారం ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద సహాయక చర్యల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తోందని, ఆర్మీ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, హైడ్రా, సింగరేణి, మైన్స్, రెస్క్యూ, దక్షిణ మధ్య రైల్వే బృందాలు ప్రతికూల పరిస్థితుల్లోనూ 24 గంటల పాటు శ్రమిస్తున్నాయని అన్నారు. మైనింగ్ ప్రమాదాల్లో నిష్ణాతులైన వారి సేవలను వినియోగించుకుంటూ, వారి సలహాలు, సూచనలు తీసుకుంటూ సహాయక చర్యలను కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం టన్నెల్‌లో కన్వేయర్ బెల్టును 13,630 మీటర్ల నుంచి 13,730 మీటర్ల వరకు పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్ దేవసహాయం, ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్, విజయ్‌కుమార్, ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా అధికారి సుదర్శన్‌రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే అధికారి నేతిచంద్ర, జేపీ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సొరంగం వద్ద సహాయక చర్యలపై చర్చిస్తున్న ప్రత్యేక అధికారి శివశంకర్

రాష్ట్రస్థాయిలో..
అయిజకు 4వ ర్యాంకు

- 95 శాతం ఇంటిపన్ను వసూలు
- మార్చి 31 నాటికి రూ.1.62 కోట్లు
- 15వ ఆర్థిక సంఘం నిధులకు అర్హత సాధించిన పట్టణం



95 శాతం పన్ను వసూలు చేసిన అయిజ మునిసిపాలిటి సిబ్బంది

అయిజ టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్ను వసూలులో అయిజ మునిసిపాలిటీకి రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు దక్కింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి అయిజ పట్టణంలో ఇంటిపన్నుల డిమాండ్ రూ.1.82 కోట్లు ఉండగా మార్చి 31 నాటికి రూ, 1.62 కోట్లు వసూలు చేశారు. 95 శాతం పన్నులు వసూలు చేయటంతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ 15 ఆర్థిక సంఘం నిధులు సాధించేందుకు అయిజ మునిసిపాలిటీ అర్హత సాధించింది. ఈ మేరకు ఈ ఏడాది నుంచి అయిజ మునిసిపాలిటీకి వివిధ అభివృద్ధి పనులకు విడుదలయ్యే కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నిధులు పెరగనున్నాయి. ఆర్థిక సంఘాల నియమనిబంధనల ప్రకారం గతేడాది రూ.1.44 కోట్లు వసూలు చేసిన పన్నుల శాతానికి, ఈ ఏడాది 12 శాతం అధికంగా వసూలు చేయాలి. అప్పుడే ఆర్థిక సంఘం నిధులు విడుదల అయ్యేందుకు వీలవుతుంది. ఈ ఏడాది అయిజ మునిసిపాలిటీ సిబ్బంది గతేడాది కంటే 12.09 శాతం పన్నులు ఎక్కువగా వసూలు చేశారు. దీంతో అయిజ మునిసిపాలిటీకి ఆర్థికసంఘం నిధులు అందే అవకాశం ఏర్పడింది. అయిజ పట్టణం మరింత అభివృద్ధి జరగాలంటే నిధులు రావాలని, అందుకు అనుగుణంగా సిబ్బంది ప్రణాళిక ప్రకారం పన్ను వసూలు చేసి రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు సాధించారు. దీంతో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులు పెరిగేలా కృషి చేశామని కమిషనర్ సైదులు తెలిపారు.

పంచాయతీలకు నిధుల కట కట

- ప్రత్యేక పాలనలో సాఫీగా సాగని పంచాయతీల పాలన
- ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఆగిన అభివృద్ధి
- సిబ్బందికి జీతాలు అందక రోడెక్కి ధర్నాలకు దిగుతున్న దుస్థితి
- నిధులు రాక, పనులు చేపట్టలేక మానసిక ఒత్తిడికి లోనవుతున్న కార్యదర్శులు


బిజినేపల్లిలోని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి శాఖ కార్యాలయం

బిజినేపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : దేశానికి పల్లెలే పట్టు కొమ్మలని, పల్లెలు అభివృద్ధి చెందితేనే ప్రపంచ పటంలో దేశం వెలిగిపోతదని అధికార, అనధికార రాజకీయ నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలతో హోరెత్తిస్తుంటారు. కానీ క్షేత్రస్థాయిలో పంచాయతీ తీరు అధ్వానంగా మారింది. రాష్ట్రంలో సర్పంచుల పాలన ముగిసి ఏడాది దాటినా ప్రభుత్వం కొత్త సర్పంచుల ఎన్నికకు పచ్చజెండా ఊపలేదు. వారి స్థానంలో ప్రత్యేక అధికారుల పాలనను తీసుకొచ్చి గ్రామ పరిపాలనను పెనం మీది నుంచి పొయ్యిలోకి నెట్టినట్లుగా గ్రామాల దుస్థితి తయారైంది. వివిధ శాఖల అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించి పంచాయతీ కార్యదర్శులచే పాలన సాగిస్తున్నారు. ప్రత్యేక అధికారులు తమ శాఖ కార్యక్రమాలతోనే సతమతమవుతూ తమకు కేటాయించిన గ్రామానికి నెలకు ఒకసారి కూడా పోయే పరిస్థితి కనబడటం లేదు. అంతేకాకుండా పంచాయతీలకు నెల వారీగా అవసరమైన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో విడుదల చేయకపోవడంతో అభివృద్ధి పనులు కొనసాగించడం పంచాయతీ కార్యదర్శులకు కత్తి మీద సాముగా మారింది. వేసవి కాలం ప్రారంభం కావడంతో చాలా గ్రామాల్లో నీటి ఎద్దడి మొదలైంది. అవసరమైన చోట పాత బోర్లను ఫ్లషింగ్ చేసి మోటార్లు బిగించడం, మోటార్ల రిపేర్ చేయించడం, కొత్త పైప్‌లైన్‌లు వేయడం, మురుగునీటి కాలువ శుభ్రం చేయించడం, వీధి లైట్ల పునరుద్ధరణతో పాటు గ్రామంలో నిత్యం చెత్త సేకరణ వెళ్లే వాహనాలకు డీజిల్ పోసేందుకు నగదు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు చాలా మంది అప్పులు తెచ్చి పెడుతున్నారు. దీనికి తోడు ఆరు నెలలుగా మల్టీపర్పస్ కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో నిరసనలు, ధర్నాలు చేపట్టి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పంచాయతీలకు అవసరమైన నిధులు విడుదల చేయడంతో పాటు వెంటనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించి పంచాయతీ పాలనను గాడిన పెట్టాలని పలువురు కోరుతున్నారు.

పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తేనే సాఫీగా పాలన



రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి సర్పంచులను నియమిస్తేనే పంచాయతీ పాలన సాఫీగా సాగుతుంది. ప్రత్యేక అధికారుల పాలనలో పల్లెల్లో రోజు రోజుకు సమస్యల పెరుగుతున్నాయే తప్పా సమసిపోవడం లేదు. వీధుల్లో పేరుకపోయిన చెత్తను తీసుకెళ్లే వాహనం రాకపోవడంతో వీధులు చెత్తతో నిండిపోతున్నాయి. అధికారులను నిలతీస్తే నిధులు లేక పనులు సకాలం చేయలేకపోతున్నామని, క్లీన్ చేయిస్తామని దాటవేస్తున్నారు.

- సూర్య సురేష్, మాజీ వార్డు సభ్యుడు, ఖానాపూర్ గ్రామం.

మండలంలో పరిస్థితి ఇలా..

బిజినేపల్లి మండలంలో 35 గ్రామ పంచాయతీలు, 24 తండాలు ఉన్నాయి. మండలంలోని ఆయా శాఖల అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించి వారిపై మండల ప్రత్యేక అధికారిగా జిల్లా సంక్షేమ శాఖ అధికారిని రాజేశ్వరిని నియమించి పర్యవేక్షణ సాగిస్తున్నారు. మండల కేంద్రం బిజినేపల్లి, నందివడ్డెమాన్, మంగనూర్, వట్టెం, లట్టుపల్లి, గంగారం, పాలెం వంటి ఐదు వేలకు పైగా జనాభా ఉన్న పెద్ద పంచాయతీల్లో నిత్యం సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వాటిని పరిష్కరించుకునేందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తండా పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో ఎలాంటి పనులు చేయలేక నిస్సాయస్థితిలో ఉన్నామని, సిబ్బందికి జీతాలు ఇవ్వకపోవడంతో వారితో మాటలు పడాల్సి వస్తుందని వాపోతున్నారు.

నెల నెల జీతాలు ఇవ్వాలి



నెల నెల జీతాలు ఇవ్వకపోవడంతో అప్పులు చేసి బతుకు ఈడ్చాల్సి వస్తుంది. జీతాల కోసం రోడెక్కి నిరసనలు, ధర్నాలు చేపట్టాల్సి వస్తుంది. 4 నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఈ మధ్యనే రెండు నెలల జీతాలు ఇచ్చిన గతంలో నిత్య అవసర సరుకుల కోసం చేసిన అప్పులు తీర్చడానికి కూడా సరిపోలేదు. దీంతో పండుగ చేసుకోలేక పోతున్నాం. అందరూ పిల్లలకు కొత్త బట్టలు ఇప్పించిన మేము మాత్రం పిల్లలకు పండుగ పూట సరైన తిండి కూడా పెట్టలేని దుస్థితిలో ఉన్నాం. ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు గౌరవ వేతనంగా రూ.18 వేలు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల 1న అకౌంట్‌లో జమ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలి.

- బత్తుల వెంకటేశ్వర్లు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు

శివకుమార్‌ను అభినందించిన మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్


శివకుమార్‌ను అభినందిస్తున్న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

కల్వకుర్తి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్‌ను మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అభినందించారు. స్వామి వివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను శివకుమార్ మాజీ రాష్ట్రపతికి సోమవారం కలిసి వివరించగా, ఆయన సైవిధంగా స్పందించారు. జాతీయ స్థాయి యువజన అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయమని మాజీ రాష్ట్రపతి అభినందించారని శివకుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

'అభయ హస్తం' పథకం డబ్బులు అందేనా?

హన్వాడ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాల సభ్యులు వైఎస్సార్ 'అభయ హస్తం' పింఛన్ పథకం కోసం చెల్లించిన డబ్బులు 12 సంవత్సరాలైనా అందకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నవంబరు 1, 2009 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వైఎస్సార్ అభయహస్తం స్వయం సహాయక బృందం భాగస్వామ్య పింఛన్ పథకాన్ని ప్రవేశ పెట్టింది. మహిళా సంఘంలో సభ్యులైన 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతీ మహిళ ఈ పథకంలో చేరవచ్చు అని ప్రకటించింది. హన్వాడ మండలంలో దాదాపు 4,610 మంది ఈ పథకంలో చేరగా, ప్రతీ సంవత్సరం వయస్సు బట్టి రూ.365 నుంచి రూ.3,650 వరకు చెల్లించారు. పొదుపుతో పాటు నెలనెల ఈ పథకం కోసం దాదాపు రూ.75 లక్షలు చెల్లించారు. అయితే 2014 తర్వాత తెంగాణ ప్రభుత్వం వచ్చాక ఈ పథకాన్ని 2016లో రద్దు చేసింది. కనీసం పథకం గురించి పట్టించుకోలేదు. అయితే 60 సంవత్సరాలు నిండిన సభ్యులు పింఛన్ ఇప్పించాలని వెలుగు సిబ్బందిపై ఒత్తిడి తీసుకరాగా, ఈ విషయాన్ని పై అధికారులకు వివరించినా ఎలాంటి ఫలితం కనిపించలేదు. 2018లో రెండో సారి తెలంగాణ ప్రభుత్వం వచ్చాక కొంత కదలిక వచ్చింది. వైఎస్సార్ అభయహస్తం స్వయం సహాయక బృందం భాగస్వామ్య పింఛన్ పథకం కోసం మహిళా సంఘాల సభ్యులు చెల్లించిన డబ్బులకు వడ్డీతో కలిపి చెల్లిస్తామని ప్రకటించి, పథకంలో చేరిన సభ్యుల వివరాలు సేకరించి వెబ్‌సైట్‌లో పెట్టింది. కానీ ఒక్క సిరిసిల్ల జిల్లాలో కొందరికి చెల్లించి మధ్యలోనే నిలిపివేశారు. మండలంలో 4,610 మందికి వడ్డీతో కలసి దాదాపు రూ.1.10 కోట్లు రావల్సి ఉందని డీఆర్డీవో (వెలుగు) సిబ్బంది అంచనా వేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 21 లక్షల మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులు డబ్బులు చెల్లించారని అధికారులు అంచనా వేశారు. అందుకు రూ.545 కోట్లు అవసరమని గుర్తించారు. కానీ ఇప్పటి వరకు వారికి చెల్లించడం లేదు.

ప్రభుత్వ ఆదేశాలతో పనిచేస్తాం : ఏపీఎం సుదర్శన్

ప్రస్తుతం అభయ హస్తం స్వయం సహాయక బృందం భాగస్వామ్య పింఛన్ పథకం అమలులో లేదు. గత ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో లబ్ధిదారుల వివరాలు సేకరించి, ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాం. ప్రస్తుత ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకొని ఆదేశాలు ఇస్తే వాటిని అమలు చేస్తాం.

ఒక కళాశాల.. మూడు చోట్ల విద్యా బోధన

- వనపర్తి ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థుల అవస్థలు
- అద్దె భవనంలో అరకొర వసతులతో ఇక్కట్లు


ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులకు పాఠాలు బోధించడానికి అద్దెకు తీసుకున్న భవనం


ఎక్స్‌టెన్షన్ క్లాసుల ద్వారా పాఠాలు వింటున్న విద్యార్థులు

వనపర్తి విద్యావిభాగం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : కళాశాల ఒకటే కానీ, మూడు చోట విద్యాబోధన కొనసాగుతున్నది. దీంతో వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వనపర్తి జిల్లాకు 2022లో జెఎన్టీయూ అనుబంధ ఇంజనీరింగ్ కళాశాల మంజూరయ్యింది. అప్పట్లోనే కళాశాల భవన నిర్మాణం కోసం ప్రభుత్వం జిల్లా కేంద్రంలోని మర్రికుంట వద్ద 45 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. తాత్కాలిక పనులు చేపట్టేందుకు రూ.4.50 కోట్లు మంజూరు చేసింది. కానీ కళాశాల భవన నిర్మాణం, వసతి గృహాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయం నిర్మాణానికి దాదాపు రూ. 150 కోట్లు అవసరమని తెలుస్తోంది. కానీ ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు మంజూరు చేయలేదు. దీంతో మూడు సంవత్సరాల నుంచి జిల్లా కేంద్రంలోని పీజీ కాలేజీ, దానికి సమీపంలోని మరో ప్రభుత్వ కళాశాలతో పాటు, ఒక అద్దె భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు రెండు బాలుర వసతి గృహాలు, ఒక బాలికల వసతి గృహం కూడా అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటికి ప్రస్తుతం ప్రతీ నెల దాదాపు రూ. 4.5 లక్షల అద్దెను చెల్లిస్తున్నారు. అయితే ఆ భవనాల్లో వసతులు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి, నూతన భవనాలను నిర్మించాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

ఇంజనీరింగ్ కళాశాల మంజూరై మూడు సంవత్సరాలు గడిచినా, నేటికి సొంత భవనం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సొంత భవనాలు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, రిజిస్ట్రార్‌ల దృష్టికి తీసుకెళ్లాం. వచ్చే అకాడమిక్ సంవత్సరానికైనా భవనాల నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

- ఎన్‌వీఎస్ రాజు, ప్రిన్సిపాల్

గెస్ట్ లెక్చరర్లతోనే బోధన

ప్రస్తుతం ఇంజనీరింగ్ కాలేజీలో సీఎస్సీ, ఏఎంఎల్, ఈసీ, మెకానికల్, సివిల్ బ్రాంచ్‌లలో మూడు సంవత్సరాలకు కలిపి దాదాపు 700 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యాబోధనకు దాదాపు 41 మంది అధ్యాపకులు అవసరం. ప్రస్తుతం ముగ్గురు రెగ్యులర్ లెక్చరర్లు, 38 మంది గెస్ట్ లెక్చరర్లతో విద్యాబోధన కొనసాగిస్తున్నారు. కొన్ని సబ్జెక్టులకు గెస్ట్ లెక్చరర్లు కూడా లేకపోవడంతో హైదరాబాద్ నుంచి ఎక్స్‌టెన్షన్ క్లాసులు నిర్వహిస్తున్నారు.

నిరుద్యోగులకు శిక్షణ

వనపర్తి రూరల్, మార్చి31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మధుకర్ స్వామి సారథ్యంలో పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ల్యాండ్స్ సంయుక్త ఆధ్వర్య ంలో ఆర్ఆర్‌బీ, గ్రూప్ డీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ఉచితంగా 3 , 4 నెలల పాటు భోజన వసతితో కూడిన నాణ్యమైన శిక్షణను అందిస్తున్నట్లు సోమవారం పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ పొందడానికి ఏప్రిల్ 5వ తేదీన రెండు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో వివిధ సెంటర్లలో అర్హత పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో భాగంగా తెలంగాణలోని వనపర్తి, హైదరాబాద్, అమీర్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్ పరీక్ష కేంద్రాల్లో అర్హత పరీక్ష 100 మార్కులకు గాను 90 నిమిషాల సమయం కేటాయిస్తారని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఏప్రిల్ 3వ తేదీ లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలను పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ టెలిగ్రామ్ గ్రూప్ ఫాలో కావాలని సూచించారు.

సన్నబియ్యం రాక

- నారాయణపేట జిల్లాలో 298 రేషన్ దుకాణాలు
- 3,382.916 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయింపు
- నేటి నుంచి లబ్ధిదారులకు పంపిణీ


పేటలో ఓ రేషన్ దుకాణం


పేటలో సన్నబియ్యం పరిశీలిస్తున్న రేషన్ డీలర్

నారాయణపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రేషన్ వినియోగదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉగాది, రంజాన్ తోఫాగా రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యాన్ని పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. అందుకోసం అవసరమైన బియ్యం జిల్లా వ్యాప్తంగా ఉన్న రేషన్ దుకాణాలకు చేరింది. జిల్లాలోని 13 మండలాల్లో 298 రేషన్ దుకాణాలు, 1,44,472 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో అన్నపూర్ణ 30, అంత్యోదయ 9,550, ఆహార భద్ర త కార్డులు 1,34,892 కార్డులున్నాయి. మొత్తం 3,382.916 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం రేషన్ దుకాణాలకు చేరుకున్నది. ఒక్కో రేషన్ దుకాణంలో లబ్ధిదారులు గరిష్ఠంగా 1,200 మంది, కనిష్ఠంగా 500 మంది ఉన్నారు. జిల్లాలోని మరికల్, ధన్వాడ, పేరపళ్ల, దామరగిద్ద, నారాయణపేట పట్టణంలోని అశోక్‌నగర్‌లలో మంగళవారం ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

మండలాల వారీగా సన్న బియ్యం కేటాయింపు

మండలం	రేషన్ కార్డులు	సన్నబియ్యం (కిలోలు)
దామరగిద్ద	13,360	346111
ధన్వాడ	9,221	226035
కోస్గి	15,257	348804
కృష్ణ	7,370	164384
మద్దూర్	17,690	414272
మాగనూర్	6,932	155686
మక్తల్	18,846	449720
మరికల్	9,777	220994
నారాయణపేట	23,194	549207
నర్వ	9,164	191903
ఊట్కూర్	13,661	315800
మొత్తం	1,44,472	33,82,916

నేటి నుంచి ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు


ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

వంగూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి దిద్దబండ అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఏప్రిల్ 1 నుంచి 4వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. రూ.30 లక్షలతో నూతనంగా ఆ లయ నిర్మాణం చేపట్టారు. స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉత్సవాలకు వంగూరు మండలంతో పాటు అచ్చం పేట, కల్వకుర్తి నియోజకవర్గాలలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుంటారు.

ఉత్సవాల వివరాలు

మంగళవారం మండప పూజలు, హోమాలు, బుధవారం స్వామి వారి విగ్రహ ఊరేగింపు, హోమ పూజలు, గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన, శుక్రవారం పోలేరమ్మ తల్లికి బోనాల కార్యక్రమాలు ఉంటాయి.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ఆంజనేయ స్వామి ఆలయాన్ని నూతనంగా నిర్మించాం. ఈ ప్రాంతంలో ఈ ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆలయం వద్ద టెంట్లు, తాగునీరు, అన్నదానం వంటి కార్యక్రమాలు భక్తులకు ఏర్పాటు చేశాం.

- ముత్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్

ఉత్సవాల ఆహ్వాన పత్రిక విడుదల

వంగూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండారెడ్డిపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 6న శ్రీరామనవమి పురస్కరించుకొని నిర్వహించే రాముల వారి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఏనుముల కృష్ణారెడ్డి విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ వేమారెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న ఏనుముల కృష్ణారెడ్డి

నేటి నుంచి వీరభద్రుడి బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన వీరభద్రేశ్వర ఆలయం

- 3న మహా రథోత్సవం

దామరగిద్ద, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండలం, క్యాతన్‌పల్లిలో కొలువు దీరిన వీరభద్రేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నారాయణ, అర్చకులు శివకుమార్‌స్వామి, శరణయ్యస్వామి తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు నాలుగు రోజుల పాటు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉత్సవాల వివరాలు

మొదటి రోజు మంగళవారం ఉదయం సుప్రభాత సేవ, అంకుర్పారణ, రుద్రాభిషేకం, భద్రకాళి అమ్మవారికి విశేష అలంకరణ, కుంకుమార్చన నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం ఉంటుంది. సాయంత్రం అర్చకుడు కీర్తిశేషులు వీరయ్యస్వామి ఇంటి నుంచి ఆలయం వరకు స్వామివారికి పల్లకి సేవ నిర్వహిస్తారు. రాత్రికి పూల తేరు, అనంతరం అగ్ని గుండం ప్రవేశం ఉంటాయి. గురువారం ఉదయం రుద్రాభిషేకం, మహా అలంకణ దర్శనం, పరివార దేవతారాధన, డోలారోహణం నిర్వహిస్తారు. రాత్రి రెండు గంటలకు స్వామివారి మహారథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం రుద్రాభిషేకం, పుట్టపూజ, అఖండ హారతి కార్యక్రమాలుంటాయి. ఈ ఉత్సవాలకు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి, భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజ్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నారు. ఉత్సవాలకు ఉమ్మడి పాలమూరుతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరానున్నారు.

భీమా నదిలో నీరు లేక ఎండుతున్న వరి పంటలు

- దిగువకు నీరు విడుదల చేయాలని రైతుల ఆవేదన


నీరు లేక బండరాళ్లు తేలిన భీమా నది


భీమా నదిలో నీరు లేక మోటార్ల పుట్‌బాల్ తేలిన దృశ్యం

కృష్ణ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): భీమా నదిలో నీరు లేక బండరాళ్లు తేలి ఎడారిగా మారింది. కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా గూడూరు వద్ద భీమా నదిపై ఉన్న రోడ్డు కం బ్యారేజీ నుంచి దిగువకు నీరు వదలాలని ఎమ్మెల్యేను కలిసి విన్నవించినా కూడా ఫలితం దక్కలేదని 18 ఎకరాలు ఉన్న రైతు ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమా నది ఒడ్డున ఉన్న పరివాహక ప్రాంతాలైన సుకూరులింగంపల్లి, ఐనాపూర్, తంగడిగి, కుసుమూర్తి గ్రామాల్లో దాదాపు 2 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం పొట్ట దశలో ఉన్న వరి పంటకు నీరు పుష్క లంగా అవసరం ఉంది. పైభాగం నుంచి దిగువకు నీరు వదిలితే తప్ప వరి పొలాలకు చేరవని రైతులు దిగాలు చెందుతున్నారు. చివరి ఆయకట్టుదారులు వరి మడులకు నీరు లేక ఎండిపో తున్నాయని వాపోతున్నా రు. ప్రస్తుతం చివరి రెండు, మూడు వరి మడులకు నీరు అందించకుంటే అసలుకే కాకుండా పూర్తిగా నష్టపోతామని వారు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భీమా నదికి నీరు విడుదల చేసే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

కల్వకుర్తి అప్నా బజార్‌లో అగ్ని ప్రమాదం

» రూ.50 లక్షల ఆస్తినష్టం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్

కల్వకుర్తి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన మారం రాకేశ్ సోదరులకు చెందిన వ్యాపార సముదాయం (అప్నా బజార్)లో సోమవారం తెల్లవారు జామున అగ్ని ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో దాదాపు రూ. 50 లక్షల అస్తినష్టం సంభవించింది. ప్రమాదంలో మారం రాకేష్ నిర్వహిస్తున్న ఎమ్మెస్ సొల్యూషన్స్‌లోని కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, సామగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యింది. ఆయన సోదరుడు రాఘవేందర్ నిర్వహించే గానుగ యంత్రాలు దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి సంఘటన వివరాలను తెలిపి, బాధితులకు అండగా నిలవాలని కోరారు. అనంతరం అనంతరం రాకేశ్, రాఘవేందర్‌లను పరామర్శించారు. సంఘం తరఫున సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ బాధితులను పరామర్శించారు. ఆయన వెంట మునిసిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జూలూరు రమేశ్‌బాబు, నాయకులు కుల్కచర్ల రమేశ్, శివజగీశ్వర్, శ్రీధర్ పాల్గొన్నారు.

కారు బోల్తా : వ్యక్తి మృతి

జడ్చర్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి-44పై జడ్చర్ల మండలం మల్లెబోయిన్‌పల్లి సమీపంలో సోమవారం కారు బోల్తా పడింది. ఈ సంఘటనలో కారు డ్రైవింగ్ చేస్తున్న ఈపూరి కిశోర్ (45) మృతి చెందాడు. జడ్చర్ల ఎస్ఐ చంద్రమోహన్ కథనం ప్రకారం.. జోగులాంబ గద్వాల జిల్లా ధరూరు మండలం మార్లవీడు గ్రామానికి చెందిన ఈపూరి కిశోర్ వ్యాపారం చేసుకుంటూ ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. తన భార్య పవిత్ర, కుమార్తె శిరీషతో కలిసి సోమవారం ఉదయం కందూరు రామలింగేశ్వరస్వామి ఆలయానికి హైదరాబాద్ నుంచి జడ్చర్ల మీదుగా వెళ్తుండగా.. ఉదయం 11.15 గంటలకు మల్లెబోయిన్‌పల్లి గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు కారు బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవింగ్ చేస్తున్న కిశోర్‌కు తీవ్రగాయాలు కాగా మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 12.30 గంటలకు మృతి చెందాడని తెలిపారు. కిశోర్ సోదరుడు ఈపూరి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాండ్రలో దొంగల హల్‌చల్

కల్వకుర్తి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మండలంలోని తాండ్ర గ్రామంలో ఆదివారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అర్ధరాత్రి వేళ గ్రామంలో ప్రవేశించిన దొంగలు చిక్కుడు వెంకటయ్య ఇంటి తాళం విరగ్గొట్టి రూ. 10 వేలు, వసంత్ ఇంట్లో 3 తులాల బంగారం, కొంత నగదును దోచుకున్నారు. శ్రీనివాస్ అనే వ్యక్తి ఇంటి ముందు ఉన్న ద్విచక్ర వాహనాన్ని కూడా ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం, కేసు నమోదు

నవాబ్‌పేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి (19) అదృశ్యమైనట్లు ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ విక్రం, యువతి తల్లి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆమెకు ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తె ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఈనెల 26న ఆమెను చూసేందుకు వెళ్లింది. 29న తిరిగి ఇంటికి వచ్చిన ఆమెకు చిన్న కుమార్తె కనిపించలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన ఎల్లరి నరేశ్ అనే యువకుడిపై తమకు అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ విక్రం తెలిపారు.

బాలుడి కిడ్నాప్‌నకు యత్నం

పోలీసులకు ఫిర్యాదు

మిడ్జిల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేముల గ్రామానికి చెందిన రాజేందర్‌గౌడ్ కుమారుడు రుద్రాన్ష్ సోమవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి కనిపించకుండా పోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలో వెతికినా ఫలితం లేకపోయిందని, అదే గ్రామానికి చెందిన రామస్వామి అనే వ్యక్తి బాలుడితో వాడియాల స్టేజీ సమీపంలో కనిపించడంతో వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. తమ కుమారుడిని ఎందుకు తీసుకెళ్లావని బాలుడి కుటుంబ సభ్యులు ప్రశ్నించడంతో పొంతనలేని సమాధానం చెప్పాడు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పొలానికి రోడ్డు ఎలా వేస్తారు?

» నాగపూర్ గ్రామస్థుల ఆగ్రహం

» ఉత్తర్వులు రద్దు చేయాలని డిమాండ్



పొలానికి రోడ్డు వేయొద్దని అడ్డుపడుతున్న గ్రామస్థులు

రేవల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి పొలానికి ఉపాధి హామీ నిధులతో రోడ్డు వేయడం ఏమిటని వనపర్తి జిల్లా, రేవల్లి మండలం, నాగపూర్ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు నాయకులు పలుకుబడిని ఉపయోగించి పొలాలకు రోడ్లు వేయించుకుంటున్నారని ఆరోపించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పొలానికి రోడ్డు వేస్తున్న విషయం తెలుసుకున్న గ్రామస్థులు సోమవారం అక్కడికి చేరుకొని ఆందోళన చేశారు. గ్రామ కార్యదర్శిని, ప్రత్యేకాధికారి, ఎంపీడీవో పి విజయకుమార్‌ను కలిసి మాట్లాడారు. పొలానికి రోడ్డు వేసేందుకు ఎలా అనుమతిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో అంతర్గత రహదారులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్ కాపీలో స్పష్టంగా ఒక వ్యక్తి పొలం దగ్గరికి రోడ్డు మంజూరు అయినట్లు ఉందని తెలిపారు. ఈ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అయితే ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకే తాము పని చేస్తున్నామని ఎంపీడీవో విజయకుమార్ వారికి తెలిపారు.

కష్టాలను అధిగమించి.. లక్ష్యాన్ని సాధించి..

గ్రూప్-1లో సత్తా చాటిన పాలమూరు యువత

లక్ష్య సాధనలో ఎన్నో అవాంతరాలను ఎదుర్కొన్నారు. ఆర్థిక సమస్యలను, కష్టాలను అధిగమించారు. పట్టుదలతో ముందుకు సాగారు. అనుకున్నది సాధించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు చెందిన పలువురు యువతీ యువకులు గ్రూప్-1లో మంచి ర్యాంకు సాధించి కలను సాకారం చేసుకున్నారు. వారిలో కొందరిని 'ఆంధ్రజ్యోతి' సోమవారం పలుకరించింది. వారి వివరాలు, అభిప్రాయాలను తెలుసుకున్నది.

- వనపర్తి విద్యావిభాగం/ కొత్తకోట/ మహబూబ్‌నగర్/ మూసాపేట/ కల్వకుర్తి టౌన్/ నారాయణపేట/ తాడూరు (ఆంధ్రజ్యోతి)

తండ్రి ఆశయ సాధనే లక్ష్యం

- సుమశ్రీ, చిమనగుంటపల్లి, 179వ ర్యాంకు



తన కుమార్తె కలెక్టర్ ఉద్యోగం సాధించి, పేద ప్రజలకు సాయం చేయాలనేది తండ్రి ఆశయం. ఆయన ఆశయాన్ని నెరవేర్చడమే లక్ష్యంగా కష్టపడి చదువుకున్నది. అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకున్నది. ఆమెనే వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామానికి చెందిన సుమశ్రీ. ఆమె తల్లి సంతోషమ్మ టీబీ యూనిట్‌లో సూపర్‌వైజర్‌గా, తండ్రి కృష్ణయ్య కండక్టర్‌గా పని చేస్తున్నారు. సుమశ్రీ డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న సమయంలో తండ్రి మృతి చెందారు. తల్లి, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ముందుకు సాగిన సుమశ్రీ ఇటీవల విడుదలైన గ్రూప్-4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం దక్కించుకున్నారు. అక్కడితో ఆగిపోకుండా ఉన్నత ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో రోజుకు 10 గంటలకు పైగా సాధన చేశారు. తొలి ప్రయత్నంలోనే గ్రూప్-1లో 475.5 మార్కులతో స్టేట్ ర్యాంకు 179, మల్టీ జోనల్ ర్యాంకు 81 సాధించారు. ఈ ర్యాంకుతో డిప్యూటీ కలెక్టర్ లేదా డీఎస్పీ కొలువు లభించనున్నది. ఎప్పటికైనా కలెక్టర్ ఉద్యోగం సాధించి తండ్రి ఆశయాన్ని నెరవేర్చుతానని సుమశ్రీ అన్నారు.

ఐఏఎస్ కావడమే లక్ష్యం



- ఎం.సాహితి, కల్వకర్తి, 119వ ర్యాంకు

సమాజానికి సేవ చేసేందుకు అవకాశమున్న ఐఏఎస్ కావడమే తన లక్ష్యమని గ్రూప్-1 స్టేట్ 119వ ర్యాంకు, మల్టీజోన్-2లో 45వ ర్యాంక్ సాధించిన ఎం.సాహితి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని తిలక్‌నగర్‌కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు వెంకటరమణ, రాజ్యలత మొదటి సంతానం సాహితి. ఎంబీబీఎస్ పూర్తి చేసిన ఆమె, తొలి ప్రయత్నంలోనే గ్రూప్-1 సాధించింది. కలెక్టర్ కావడమే లక్ష్యంగా సివిల్స్‌కు సిద్ధం అవుతున్న తాను గ్రూప్-1 రాసి మంచి ర్యాంకు సాధించానని తెలిపారు. దీంతో ఉన్నత స్థాయికి ఎదగాలన్న కల నెరవేరినప్పటికీ, తన చిరకాల లక్ష్యం మాత్రం సివిల్స్‌లో విజయం సాధించి కలెక్టర్ కావడమేనని ఆమె తెలిపారు.

లక్ష్య సాధనకు పేదరికం అడ్డుకాదు

- వీణ, నారాయణపేట, 118వ ర్యాంకు



లక్ష్య సాధనకు పేదరికం అడ్డుకాదని నారాయణపేటకు చెందిన వీణ అన్నారు. ఆమె తల్లి వసుంధర గృహిణి కాగా, తండ్రి శ్రీనివాస్ ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. వీణ గ్రూప్-1 ఫలితాల్లో 484.5 మార్కులు సాధించి, రాష్ట్ర స్థాయిలో 118, ఎస్టీ కేటగిరి, మల్టీజోన్-2 మూడవ ర్యాంకును సొంతం చేసుకున్నారు. ఆమె ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీలో ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ చేస్తున్నారు. వాజీరామ్ ఇనిస్టిట్యూట్‌లో సివిల్స్‌కు కోచింగ్ తీసుకున్నారు. గతంలో సంగారెడ్డి గురుకులంలో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పని చేసిన ఆమె, ప్రస్తుతం హైదరాబాద్, గోల్కొండ జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. జీవితంలో ముందుకు సాగడానికి సామాజిక వెనుకబాటుతనం ఏమాత్రం అడ్డంకి కాబోదని ఆమె నిరూపించారు.

ప్రజలకు సేవ చేయడమే ధ్యేయం

- మండ్ల పవన్‌కుమార్, వడ్డెవాట, 25వ ర్యాంకు



సివిల్స్‌లో విజయం సాధించి, కలెక్టర్‌గా ప్రజలకు సేవ చేయడమే తన ధ్యేయమని వనపర్తి జిల్లా, కొత్తకోట మండలంలోని వడ్డెవాట గ్రామానికి చెందిన మండ్ల పవన్‌కుమార్ అన్నారు. గ్రూప్ -1లో 25వ ర్యాంకు సాధించిన ఆయన తండ్రి వెంకటస్వామి హెడ్‌కానిస్టేబుల్, తల్లి పుష్పలత గృహిణి. పవన్ కుమార్ సివిల్స్ కోసం ఢిల్లీలో శిక్షణ పొందాడు. గత సంవత్సరం సివిల్స్ పరీక్షకు హాజరు కాగా, కొద్దిగలో తప్పిపోయింది. అయినా నిరుత్సాహపడకుండా సాధన కొనసాగించారు. గ్రూప్-1లో 510 మార్కులతో 25వ ర్యాంకు సాధించారు. మంచి ర్యాంకు సాధించడంతో తనలో ఆత్మవిశ్వాసం పెరిగిందని ఆయన అన్నారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదువుకుంటే అనుకున్నది సాధించవచ్చన్నారు. కుటుంబ స్థితిగతులు తారుమారైనా కుంగిపోకుండా సహనంతో వ్యవహరించాలని సూచించారు. పరిస్థితులు అనుకూలించినప్పుడు అడుగు ముందుకేసి, పట్టుదలగా సాధన చేయాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలమని చెప్పారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే విజయం

- ఎం.వెంకటేశ్ ప్రసాద్‌సాగర్, నిజాలాపూర్, 27వ ర్యాంకు



తల్లిదండ్రులు వెన్నంటి ప్రోత్సహించడం వల్లే తాను గ్రూపు-1లో రాష్ట్ర స్థాయిలో 27వ ర్యాంకు సాధించానని మూసాపేట మండలం నిజాలాపూర్ గ్రామానికి చెందిన ఎం.వెంకటేశ్ ప్రసాద్‌సాగర్ అన్నారు. డీఎస్పీగా ఉద్యోగం సాధించడమే తన లక్ష్యమని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా, మూసాపేట మండలం, నిజాలాపూర్ గ్రామానికి చెందిన ఎం.సత్తయ్య, యశోద దంపతుల కుమారుడు ఎం.వెంకటేష్ ప్రసాద్‌సాగర్ గ్రూప్-1 పరీక్ష రాయగా 300 ర్యాంకు వచ్చింది. రెండోసారి రాష్ట్ర స్థాయిలో 27వ ర్యాంకు, మల్టీజోనల్ లెవల్‌లో 12వ ర్యాంకు సాధించాడు. సివిల్ సర్వీసు పరీక్షల ఫలితాలు ఇంకా రాలేదని, ప్రస్తుతం హైదరాబాద్‌లో శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. ఉద్యోగం చేస్తూనే సామాజిక సేవాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సహానికి తోడు కృషి, పట్టుదల, ఏకాగ్రత, సాధించాలనే తపనతో ముందుకు సాగితేనే ఏదైనా సాధించే అవకాశం ఉందని తెలిపారు.

కష్టనష్టాలను చూస్తూ పెరిగాను

- సుజాత ఎస్ఐ, బుసిరెడ్డిపల్లి, 405వ ర్యాంక్



చిన్నప్పటినుంచి కుటుంబ కష్టాలు చూస్తూ పెరిగానని, నా చిన్నతనంలోనే నాన్న చనిపోయినా అమ్మే అన్నీ తానై చదివించారని మహబూబ్‌నగర్ భరోసా కేంద్రం ఇన్‌చార్జి, ఎస్ఐ సుజాత అన్నారు. ఈ రోజు విజయం సాధించానంటే అమ్మ కష్టమే కారణమన్నారు. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం బుసిరెడ్డిపల్లికి చెందిన సుజాత తన నాలుగవ ఏటనే తండ్రిని కోల్పోయారు. ముగ్గురు పిల్లలన్న కుటుంబ బాధ్యతను తల్లి కళావతి తీసుకున్నారు. ఉన్న కొద్దిపాటి భూమిని నమ్ముకుని వ్యవసాయం చేస్తూ పిల్లలను చదివించారు. ఆమె అక్క పెళ్లి కాగా, తమ్ముడు కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకుని వ్యవసాయ రంగంలో స్థిరపడ్డారు. ఉద్యోగం సాధించి తల్లి కష్టాలను దూరం చేయాలన్న లక్ష్యంతో సుజాత ఇంటర్ అయిపోగానే కానిస్టేబుల్ పరీక్ష రాసి ఉద్యోగం సాధించారు. విధులను నిర్వర్తిస్తూనే ఓపెన్ డిగ్రీ పూర్తిచేసి ఎస్ఐగా ఎంపికయ్యారు. మొదట మహబూబ్‌నగర్ టూటౌన్ ఎస్ఐ గా, ఆ తర్వాత మూసాపేట ఎస్ఐగా పని చేశారు. ప్రస్తుతం భరోసా కేంద్రం ఎస్ఐగా పని చేస్తున్నారు. ఆ బాధ్యతలను నిర్వర్తిస్తూనే గ్రూప్-1కు సిద్ధమయ్యారు. 459 మార్కులతో రాష్ట్ర స్థాయి 405 ర్యాంక్ సాధించారు. ఈ ర్యాంకుతో డీఎస్పీ అయ్యే అవకాశాలున్నాయి. అంచెలంచెలంచెలుగా కొద్ది కాలంలోనే ఉన్నత హోదాకు చేరుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ఆమె తెలిపారు.

అమ్మా నాన్నల సంపూర్ణ మద్దతు

- ప్రశాంతి, తాడూరు, 229వ ర్యాంకు



నా కృషి, పట్టుదలకు తోడు అమ్మానాన్నల సంపూర్ణ మద్దతు వల్లే విజయం సాధించానని నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండల కేంద్రానికి చెందిన ప్రశాంతి అన్నారు. గ్రూప్-1 ఫలితాలు 229వ ర్యాంకు సాధించిన ఆమె పదవ తరగతి వరకు తాడూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. నాగర్‌కర్నూల్‌లో ఇంటర్మీడియట్, ఉమెన్స్ కాలేజ్ ఆఫ్ హైదరాబాద్ డిగ్రీ పూర్తి చేశారు. తమ కుమార్తె గ్రూప్-1 ఫలితాల్లో 470.5 మార్కులతో 229 ర్యాంకు సాధించడం ఆనందదాయకంగా ఉందని ఆమె తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

ఎక్కువ దరఖాస్తులు వచ్చేలా చర్యలు

» జోగులాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్



ఉప ముఖ్యమంత్రి వీడియో కన్ఫరెన్స్‌లో పాల్గొన్న జోగుళాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్, అదనపు కలెక్టర్ నర్సింగరావు

గద్వాల న్యూటౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం పథకానికి వీలైనంత ఎక్కువ మంది అర్హులు దరఖాస్తు చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. రాజీవ్ యువవికాసం పథకంపై సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు ఐదు లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర వెనుకబడిన తరగతుల యువత ఆర్థికంగా ఎదిగేందుకు ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఈనెల ఐదవ తేదీలోపు దరఖాస్తు చేసు కోవాలన్నారు. ఈ పథకం కుటుంబంలో ఒక్కరికే వర్తిస్తుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బీఎం సంతోష్ మాట్లాడుతూ ఈ పథకంపై గ్రామీణ యువతకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించినట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్‌బాబు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

- రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో యువత చెడు మార్గాలు వీడి క్రీడలలో రాణించాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. ఉగాది, రంజాన్ పండుగ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని చౌటబెట్లలో ఉమ్మడి జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్ సాతాపూర్, వీఆర్‌జీ-11 జట్ల మధ్య జరిగిన పోటీలలో సాతాపూర్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. వీఆర్‌జీ-11 ద్వితీయ స్థానంలో నిలిచింది. సోమవారం మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజంలో యువత గంజాయి డ్రగ్స్, మద్యానికి బానిసలు కాకుండా చదువులో రాణిస్తూ క్రీడల్లో ముందుండాలని సూచించారు. నియోజకవర్గం క్రీడాకారులకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. టోర్నమెంట్ నిర్వహణకు సహకారం అందించిన వారికి చౌటబెట్ల యూత్ తరపున ప్రత్యేకమైన ధన్య వాదాలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కొల్లాపూర్ సీఐ మహేష్, కొల్లాపూర్ ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



గిరిజ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : హ్యాండ్ బాల్ జాతీయ స్థాయి పోటీలకు మహబూబ్ నగర్‌కు చెందిన కె.గిరిజ ఎంపికయ్యారు. పట్టణంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని హత్రస్‌లో ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న హ్యాండ్‌బాల్ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర మహిళా జట్టుకు ఆమె ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు రజనీకాంత్‌రెడ్డి, జియా వుద్దీన్. అహ్మద్‌హుస్సేన్, ప్రదీప్ కుమార్, ప్రణయ్ ఆమెను అభినందించారు.

27న పూలే-అంబేడ్కర్ జాతర



కార్యక్రమంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు బోయపల్లి నరసింహులు

పాలమూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఏప్రిల్ 27న పూలే-అంబేడ్కర్ 5వ జాతర జిల్లా కేంద్రంలోని ఎంబీసీ మైదానంలో నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు బోయపల్లి నరసింహులు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళా భవన్‌లో ఏర్పాటు చేసిన జాతర కమిటీ సమావేశంలో కరపత్రం ఆవిష్కరించి, మాట్లాడారు. పూలే - అంబేడ్కర్ జాతరకు ముఖ్య అతిథులుగా సినీ రచయిత, నటుడు ఆర్. నారాయణమూర్తి, ప్రొఫెసర్ ఖాసీం, ఏపూరి సోమన్న, గిద్దె రాంనర్సయ్య హాజరవుతున్నట్లు వివరించారు. సమావేశంలో వెంకటస్వామి, మామిడి సామెల్, ఎస్.బాలరాజు, జి.లక్ష్మణ్, యాదగిరి, జంగయ్య, మాసయ్య, ఆదివిష్ణు, విద్యావతి, బాబమ్మ, కృష్ణమ్మ, గంగమ్మ, నరసింహులు, మ్యాతరి మధు, వినోద్, ఎన్.అంజనేయులు, కేశవులు, రాజు పాల్గొన్నారు.

మాతృమూర్తికి తులాభారం

» వంద ఏళ్లు పూర్తి చేసుకున్న లక్ష్మమ్మ

» వేడుక నిర్వహించిన కుమారులు



గోర్లానిబాయిలో లక్ష్మమ్మకు అరటి పళ్లతో తులాభారం చేస్తున్న కుమారులు, కుటుంబ సభ్యులు

కొత్తపల్లి, 31 (ఆంధ్రజ్యోతి) : వంద ఏళ్లు పూర్తి చేసుకున్న తల్లికి కుమార్తెలు, కుమారులు కలిసి అరటిపళ్లతో తులాభారం నిర్వహించారు. నారాయణపేట జిల్లా, కొత్తపల్లి మండలంలోని గొర్లొనిబాయి గ్రామంలో సోమవారం ఈ వేడుక జరిగింది. గ్రామానికి చెందిన జంబుల లక్ష్మమ్మకు ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. సోమవారం నాటికి లక్ష్మమ్మ వయసు వంద సంవత్సరాలు దాటింది. ఈ సందర్భంగా కుమారులు, కుమార్తెలు, మనమలు, మనమరాళ్లు కలిసి వేడుకలు నిర్వహించారు. ఆమెకు అరటిపళ్లతో తులాభారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద కుమారుడు వెంకటయ్య మాట్లాడుతూ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న కన్నతల్లికి తులాభారం నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కొడుకులు, కుమార్తెలతో పాటు, మా పిల్లల పెళ్లిళ్లను, వారి పిల్లలను కూడా ఆమె చూడటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కుమారులు బాలకృష్ణయ్య, రాములు, భీమన్న, సహదేవులు, కుమార్తెలు అనంతమ్మ, రత్నమ్మ, అక్కమ్మతో పాటు, బంధువులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

- ఏపీఎం రాములు



చారకొండ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే తెలంగాణ గ్రామీణ పేదరిక సంస్థ యొక్క లక్ష్యమని ఏపీఎం రాములు అన్నారు. ఆయన సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు తెలియజేశారు.

● ఎంతమంది మహిళలను సంఘాల్లో చేర్పించారు?

మండలంలోని అన్ని గ్రామాల్లో 5,679 మంది మహిళలను సంఘాల్లో చేర్పించి 529 స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేశాం. 28 గ్రామ సంఘాలతో పాటు ఒక మండల మహిళ సమాఖ్యను ఏర్పాటు చేశాం.

● స్త్రీ నిధి ద్వారా రుణాలు ఎంత మందికి ఇప్పించారు?

స్త్రీ నిధి ద్వారా ఇప్పటి వరకు 1,174 మందికి గాను రూ. 8 కోట్ల 91 లక్షల 70 వేల 876 ఇప్పించడం జరిగింది. ఇప్పటి వరకు 90 శా తం రికవరీ చేశాం. తీసుకున్న రుణాలను కూ డా బాగానే చెల్లిస్తున్నారు.

● మహిళా సంఘాలు బాగా నడుస్తున్నాయా?

మండలంలో ఉన్న సంఘాలు అన్నీ బాగానే నడుస్తున్నాయి. కొన్ని చోట్ల నడవని సంఘాలకు అధ్యక్షులకు, సంఘం సభ్యులకు అవగాహన కల్పించి సంఘాన్ని నడిపించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు అందిరితో చర్చిస్తున్నాం.

న్యూస్ బాక్స్

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం ప్రతిష్ఠాపనకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్వాయి పాపన్నగౌడ్ యూత్ అసోసియేషన్ నాయకులు

చారకొండ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) మండలంలోని గోకారం గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ చేశారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ యూత్ అసోసియేషన్ సభ్యులు, గౌడ కులస్థులు పాల్గొన్నారు.

భీమ్‌దీక్ష ముగింపు పోస్టర్ ఆవిష్కరణ

వెల్దండ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం భీమ్‌దీక్ష ముగింపు సభ పోస్టర్‌ను స్వైరోస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. మార్చి 15న నేలకొండపల్లిలో ప్రారంభమైన భీమ్‌దీక్ష ఏప్రిల్ 13న రంగారెడ్డి జిల్లా తలకొండపల్లిలో ముగుస్తుందని సంఘం నాయకులు పేర్కొన్నారు. జంగిలి నిరంజన్, దుబ్బనాగేష్, రామస్వామి, రాజు, వెంకటయ్య, ప్రభాకర్, కిరన్, నాగయ్య, శ్రీను, భాస్కర్ తదితరులు ఉన్నారు.

'ఉర్కొండపేట ఆలయ పరిసరాలపై నిఘా పెంచాలి'

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉర్కొండపేట ఆంజనేయస్వామి ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులకు దొంగలు, అల్లరి మూకల నుంచి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు నిఘా పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శనివారం బంధువుతో కలిసి ఆలయ దర్శనానికి వచ్చిన యువతిపై పరిసర ప్రాంతంలో మాటు చేసిన దుండగులు వెంట వచ్చిన బంధువును బంధించి ఆమెపై అఘాయిత్యానికి పాల్పడడం దారుణమన్నారు. పోలీసులు తక్షణమే నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

'కఠినంగా శిక్షించాలి'

కల్వకుర్తి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉర్కొండపేట ఆంజనేయస్వామి దర్శనం కోసం వచ్చిన మహిళపై అత్యాచారానికి పాల్పడిన గ్యాంగ్ రేపిస్టులను ఎంతటి వారైనా వదిలిపెట్టకుండా అరెస్టు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం చేయాలన్నారు. వివాహిత మహిళ దైవ దర్శనానికి వస్తే పోకిరీలు ఆమెపై అత్యాచారనికి పాల్పడినట్లు తెలుస్తున్నదని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి బాధితు రాలికి రక్షణ కల్పించి న్యాయం చేయాలని, దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి. ఆంజనేయులు, జిల్లా నాయకులు పరశురాములు, బాల్‌రెడ్డి, నాయకులు జనన్‌విజయ్, సోనీలు డిమాండ్ చేశారు.

'సీఎం సహాయ నిధి ఓ వరం'

పెద్దకొత్తపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు వరం లాంటిదని పెద్దకొత్తపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యులు దండు నరసింహ కాంగ్రెస్ పార్టీ మం డల అధ్యక్షుడు కదిరి కృష్ణలు అన్నారు. సోమ వారం పెద్దకొత్తపల్లిలో ఇద్దరు బాధితులకు మంజూరైన చెక్కులను బాధితులకు వారు అందజేశారు. పెద్దకొత్తపల్లికి చెందిన వడ్ల మహేష్‌కు 60వేలు, బేడబుడగ సంగం గడ్డంసు భాష్‌కు రూ.60వేలు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసుందర్‌రావు, తగిలి వెంకటస్వామి, గడ్డం నరహరి, ఉప్పరి హుస్సేన్, బోయ బాల నారాయణ, పెబ్బేటి మల్లయ్య, గడ్డం కుమార్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

- ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు

- పేదలకు దాన ధర్మాలు చేసిన ముస్లింలు



కల్వకుర్తి ఈద్గా వద్ద ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాద్, విజితారెడ్డి, ఎడ్మ సత్యం

నాగర్‌కర్నూల్/నాగర్‌కర్నూల్ టౌన్/చారకొండ/బిజినేపల్లి/ఉప్పునుంతల/మన్ననూర్/కోడేరు/అచ్చంపేటటౌన్/అమ్రాబాద్/పెద్దకొత్తపల్లి/తిమ్మాజిపేట/కొల్లాపూర్/కల్వకుర్తి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రంజాన్ ఉపవాస దీక్షలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పండుగ సంబరాల కోసం పట్టణ ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు భారీగా తరలివచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల కోసం ముస్లింలు వేలాదిగా తరలివచ్చారు. రంజాన్ ప్రత్యేక ప్రార్థనలను హఫీజ్ అబ్దుల్ హక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు నాగం శశీధర్‌రెడ్డి, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంద్రకల్ కుమార్‌తో పాటు అర్థం రవి, తిమ్మాజిపేట పాండు, పిడికిళ్ల పాపమ్మ, రేణుబాబు, కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హబీబ్, కావలి శ్రీను, దళిత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంకేశ్వరం నిరంజన్, మాజీ జడ్పీటీసీ కోటయ్య, నాగనూలు కృష్ణారెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్, సీఐ కనకయ్యగౌడ్, ఎస్ఐ గోవర్ధన్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కల్వకుర్తిలో జరిపిన రంజాన్ వేడుకల్లో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మునిసిపల్ మాజీ చైర్మన్, మార్కెట్ చైర్మన్ ఎడ్మ సత్యం, విజితారెడ్డి, ముస్లింలకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. కాగా కొల్లాపూర్‌లో కూడా ఈద్-ఉల్-ఫితర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఇక్కడ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై ముస్లింలకు ఆత్మీయంగా అందరిని పలుకరించారు.

● మండలంలోని చారకొండ, జూపల్లి, తుర్కలపల్లి, గోకారం గ్రామాల్లో ఈద్గాల వద్ద ముస్లిం మత పెద్దలు రంజాన్ పర్వదినం ప్రత్యేకతను వివరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చారకొండలో కల్వకుర్తి మార్కెట్ కమిటీ డైరక్టర్ ముస్తాఫ ముజ్జుబాయి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్, జూపల్లిలో డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్యయాదవ్ ముస్లింలకు ఈద్ ముబారక్ తెలిపారు.

● మండలంలోని బిజినేపల్లి, పాలెం, గంగారం, మంగనూర్, ఖానాపూర్, వడ్డేమాన్, వట్టెం, గౌరారం తదితర గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగనమోని కిరణ్, పీఏసీఎస్ చైర్మన్ బాల్‌రాజు గౌడ్, మాజీ ఎంపీటీసీ మంగి విజయ్, చీర్లం బాలస్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, డీసీసీ ఉపాధ్యక్షుడు బంగారి పర్వతాలు, ముక్తార్, పాలెం మాజీ సర్పంచ్ నాగరాజు, ఉపసర్పంచ్ చికొండ్ర రాములు, జయకృష్ణలు ముస్లింలను ఈద్గా వద్ద కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

● ఉప్పునుంతలతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు బాబుమియా, రజాక్, గఫార్, చాంద్‌పాషా, ఖాసీం, అస్లాం, బురాన్, సయ్యద్ జహింగీర్, జహీర్ ఉన్నారు.

● మన్ననూరు పరిసర గ్రామాల్లో ముస్లింలు ఉదయం స్థానిక జామే మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం ప్రార్థనలు చేశారు. మసీదు కమిటీ అధ్యక్షుడు నసీరొద్దీన్, కోఆప్షన్ మాజీ సభ్యుడు రహీం, మైనార్టీ నాయకులు రహిమాన్, అజ్మత్, వాజీద్ అలి, జహంగీర్ అలీ, నిరంజన్, మేరాజ్, ఖాదర్, ఖాజ పాల్గొన్నారు.



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న అచ్చంపేట మునిసిపల్ చైర్మన్

● కోడేరుతో పాటు మండల పరిధిలోని మాజీ తాజా ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ముస్లింలతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ మహేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

● అచ్చంపేట పట్టణ కేంద్రంలోని ఈద్గా వద్ద ముస్లింలు ఈద్-ఉల్ ఫితర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హఫీద్ ఆయూబ్ ఖాన్, హఫీజ్, హరీఫ్, సుత్తారిలు రంజాన్ పర్వదిన విశిష్టతను మహమ్మద్ ప్రవక్త సందేశాన్ని వివరించారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హైదరాబాద్ తన నివాసంలో వీడియో ద్వారా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిదంగా మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రంథాలయ జిల్లా చైర్మన్ రాజేందర్, మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, మునిసిపల్ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్‌తో పాటు పలువురు నాయకులు పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. సీఐ రవీందర్ ఎస్సై రమేష్‌లు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ నాయకులు చత్రునాయక్, గోపాల్ రెడ్డి, మల్లేష్, బీఆర్ఎస్, కాంగ్రెస్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

● అమ్రాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో రంజాన్ సందర్భంగా ముస్లింలు ప్రార్థనలు చేశారు. ముస్లిం మత పెద్దలు, అమ్రాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హరి నారాయణ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుందా మల్లికార్జున్, రఘరామాచారి, తిరుపతయ్య, సంతోష్, కోటి, రాజు, మల్లేష్, శ్రీను, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● పెద్దకొత్తపల్లి, పెద్దకార్పాముల, చిన్నకార్పాముల, మరికల్, యాపట్ల, సాతాపూర్, కల్వకోల్, చంద్రకల్ గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు, పీఏ నిరంజన్, మా జీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేసి ముస్లింలను ఆలింగనం చేసుకు న్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నాగపూర్ విష్ణు, గంట్రావుపల్లి మాజీ సర్పంచ్ చిన్నయ్య, వెన్నచెర్ల సురేష్, కాంగ్రెస్ నాయకుడు మడ్డి ఇమాన్‌గౌడ్, మాజీ సర్పంచ్ పుట్ట కృష్ణవేణి, రాములు, ఎండి. హబీబ్, నరేంద్రచారి, ఎండి.నిరంజన్, మారేడు నారాయణ, వడ్డె వెంకటస్వామి పాల్గొన్నారు.

● తిమ్మాజిపేట మండలం గుమ్మకొండ, తిమ్మాజిపేట, గొరిట, ఆవంచ, పోతిరెడ్డిపల్లి, బావాజీపల్లి తదితర గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వెంకటేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● పవిత్రమైన రంజాన్ వేడుకలను కల్వకుర్తి పట్టణంలో ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్, పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యులు ఠాకూర్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్‌లు బ్యంగి ఆనంద్‌కుమార్, పసుల సుదర్శన్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలసంజీవ్ కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పసుల రమాకాంత్‌రెడ్డి, కాటన్‌మిల్ అధ్యక్షుడు సూర్యప్రకాశ్‌రావు, మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ షహెద్, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, కల్వకుర్తి పట్టణానికి చెందిన టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రంజాన్ విందులో పాల్గొన్నారు. రమేష్ శ్రీను, రమేష్‌నాయక్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



జూపల్లిలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్యయాదవ్

కొల్లాపూర్‌లో..

● కొల్లాపూర్ పట్టణంలోని ఖాదర్ భాషా దర్గా వద్ద ఈద్గాలో ముస్లిం మత పెద్దలు హాసిం సుతారి, అయూబ్‌ఖాన్ బోధనలు చేశారు. ముందుగా కొల్లాపూర్ పట్టణంలోని జామె మసీదు నుంచి ర్యాలీగా ముస్లింలు ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని, పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించకుండా లౌకిక పార్టీలు మద్ధతు తెలపాలని వక్ఫ్ భూముల పట్ల కేంద్రం విధానాలు మార్చుకోవాలని నల్ల బ్యాడ్జీలు ధరించి ముస్లింలు నిరసన తెలిపారు.

శుభాకాంక్షలు తెలిపిన మంత్రి

● కొల్లాపూర్ పట్టణంలో ఈద్గా వద్దకు రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం మత పెద్దలకు శాలువా పూలమాలలతో సన్మానించారు. అంతకుముందు పట్టణంలోని ఖాదర్ భాషా దర్గా వద్ద మంత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

అదే విధంగా కొల్లాపూర్ మండల పరిధిలోని సోమశిల, చుక్కాయిపల్లి, కుడికిళ్ల, ఎల్లూరు, మొలచింతలపల్లి గ్రామాల్లో ఈద్గాల వద్ద మసీదులలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అదే విధంగా పీసీసీ కార్మిక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు, కొల్లాపూర్ మునిసిపల్ మాజీ ప్రజాప్రతినిధులు నరసింహారావు, మండల మాజీ ప్రజాప్రతినిధులు హనుమంత్ నాయక్, మేకల నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగ రాజశేఖర్‌గౌడ్, కృష్ణమ నాయుడు, కడప ప్రకాష్, భీమ్‌శెట్టి, దిలీప్, ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గున్ రెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ జంబులయ్యలు ఈద్గా వద్ద రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ మహేష్, హృషికేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



కొల్లాపూర్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఫూలే విగ్రహావిష్కరణకు బీసీలంతా తరలి రావాలి

బిజినేపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏప్రిల్ 9న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణకు ఆయా గ్రామాల నుంచి బీసీలంతా తరలి రావాలని బీసీ నాయకుడు గంగనమోని కిరణ్ కోరారు. మండల కేంద్రంలో దళిత సంఘాల రాష్ట్ర నాయకుడు మంగి విజయ్, పీఏసీఎస్ చైర్మన్ నాయినోళ్ల బాల్‌రాజు గౌడ్‌తో కలిసి సోమవారం విగ్రహావిష్కరణ ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. మండల బీసీ కమిటీ నాయకులు, పూలే విగ్రహావిష్కరణ కమిటీ నాయకులు సమన్వయంతో మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలంతా జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణకు హాజరయ్యేలా గ్రామాల్లో ప్రచారం చేపట్టాలని సూచించారు. వారి వెంట విగ్రహావిష్కరణ కమిటీ అధ్యక్షుడు అంతటి రాజేందర్ గౌడ్, శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు ఊర్కొండ రఘుబాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, మత్స్యకార సహకార సంఘం మండల అధ్యక్షుడు తుమ్మల అల్లోజీ, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భగవంత్ గౌడ్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు సత్యశీల సాగర్, డీసీసీ ఉపాధ్యక్షుడు బంగారి పర్వతాలు, నరేందర్ గౌడ్, పానుగంటి రాంచందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు దశరథం, గంగనమోని రాములు, అనిల్ గౌడ్, సట్ల కృష్ణయ్య, చిన్నయ్య, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.



బిజినేపల్లిలో విగ్రహావిష్కరణ ఏర్పాట్లపై మాట్లాడుతున్న దళిత సంఘాల రాష్ట్ర నాయకుడు మంగి విజయ్

హామీలన్నీ అమలు చేస్తున్నాం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని అమలుపరుస్తున్నామని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. రేషన్ షాపులో బియ్యం పథకాన్ని ప్రారంబిస్తున్నామని, సన్న బియ్యాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కల్వకుర్తి పట్టణంలో 15వ వార్డులో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు పనిచేస్తుందని తెలిపారు. రైతులకు రుణమాఫీ మహిళకు బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. దొడ్డు బియ్యం వల్ల పేద ప్రజలకు ఇబ్బందులు ఉన్నాయని గుర్తించి సన్న బియ్యం పథకాన్ని తీసుకురావడం జరిగిందని, సన్న బియాన్ని ప్రజలంతా సద్వినియెగం చేసుకోవాలని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు ఠాకూర్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ బ్యంగి ఆనంద్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సేనీల సంజీవ్‌కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు శాన్‌వాజ్‌ఖాన్, పసుల రమాకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రాములు, దామోదర్‌గౌడ్, నాయకులు శేఖర్, చంద్రకాంత్ రెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు.



సన్న బియ్యం పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

అసంపూర్తిగా ఆస్పత్రి భవన నిర్మాణం

వెల్దండ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పిన మాటలు నీటిమూటలుగా మిగిలిపోయాయి. వెల్దండ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనం శిథిలావస్థకు చేరి ప్రమాద భరితంగా మారడంతో 2021లో మండల మహిళాసమాఖ్య భవనంలోకి తాత్కాలికంగా మార్చి, ఎంఎంఎస్‌ను ఎంపీడీవో కార్యాలయంలో కొనసాగిస్తున్నారు. కాగా శిథిలావస్థకు చేరిన భవనాన్ని పునరుద్ధరించేందుకు, ఆవరణలో మరో నూతన భవనాన్ని నిర్మించేందుకు సుమారు 50 లక్షలు మంజూరు చేశారు. దీంతో స్లాబ్, గోడలు నిర్మించిన కాంట్రాక్టరు నిధుల కొరతతో భవన నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. మూడేళ్ల కావస్తున్నా పనులు పూర్తికాకపోవడంతో ఆస్పత్రి సిబ్బంది రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిళా సమాఖ్య భవనంలో అసంపూర్తిగా వసతుల ఉండటంతో ప్రతినిత్యం తిప్పలు తప్పడం లేదు. ప్రతిరోజు వందల సంఖ్యలో రోగులు ఆస్పత్రికి వస్తుంటారు. కాగా మహిళా రోగులకు వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితులలో రోగులు కల్వకుర్తి, హైదరాబాద్‌కు వెళ్లాల్సివస్తుంది. ఇప్పటికైనా భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులను పూర్తిచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం

వంటపాత్రల బహూకరణ



ఐతోల్ గ్రామంలో దేవాలయాలకు వంట పాత్రలు బహూకరిస్తున్న దాత రమేష్‌గౌడ్

తాడూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐతోల్ గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయానికి రమేష్‌గౌడ్ రూ.70వేల విలువైన వంటపాత్రలను సోమవారం అందజేశారు. ఐతోల్ గ్రామ ఆలయాల చైర్మన్ శేఖర్, ప్రముఖ శ్రీవైద్య నిపుణురాలు డాక్టర్ జయంతి, దాతరమేష్‌గౌడ్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆటల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



ట్రాక్టర్ రివర్స్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేసిన నాయకులు

పెంట్లవెల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ మండలం రామాపురం గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకొని గ్రామంలో ఆటల పోటీలు నిర్వహించారు. క్రికెట్ పోటీల్లో గెలుపొందిన ఘనమోని రాముడు టీమ్‌కు పదివేల రూపాలయ బహుమతి, అదే విధంగా రెండో బహుమతి బత్తిని రాజు టీంకు రూ. 5000, గ్రామ నాయకులు అందజేశారు. అదే విధంగా ట్రాక్టర్ రివర్స్ పోటీలలో మొదటి బహుమతి గెలుపొందిన గడ్డం మల్లేష్‌కు మూడు తులాల వెండి, రెండో బహుమతి పొందిన ఆకునమోని రాజుకు రెండు తులాల వెండి, అదే విధంగా ద్విచక్ర వాహన స్లో పోటీలలో గెలుపొందిన నల్లవెల్లి శివకు మొదటి బహుమతి, ఆకునమోని రాజుకు రెండు తులాల వెండిని గ్రామస్థులు అందజేశారు.

నాయకులు కొమ్ము రాజు, మాజీ సర్పంచు బచ్చలకూర బాలరాజు, నాయకులు ఆకునమోని చంద్రయ్య, కలమూరి మ ధు, నల్లవెల్లి చంద్రయ్య, ఉడుత రామస్వామి, గోపాల్, మధు, రామయ్య, ఖాదర్, ఉడుత రాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మన్‌పల్లిలో ఎమ్మార్పీఎస్ జెండావిష్కరణ వేడుకలు

అచ్చంపేటటౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొమ్మన్‌పల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండావిష్కరణ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో డప్పులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎస్సీ వర్గీకరణ సాధకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సౌటకాశీం, తాలూకా ఇన్‌చార్జి సాంబశివరావు హాజరై పాల్గొని మాట్లాడారు. పలువురు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల నాయకులు మాజీ ఎంపీపీ పర్వతాలు, మాజీ సర్పంచ్ బొడ్కా నాయక్, ధర్మనాయక్, బాల్‌రాజు, రమేష్, ఏకలవ్య, కరుణాకర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మార్పీఎస్ జెండావిష్కరణ వేడుకలు జరుపుకున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కలెక్టర్ అనుమతి తర్వాతనే విగ్రహాల ఏర్పాటు

- సీఐ రవీందర్

ఉప్పునుంతల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ అనుమతి తర్వాత విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని అచ్చంపేట సీఐ రవీందర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొరటికల్ గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో కొంతమంది యువకులు ఆదివారం అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు గుంతలు తీశారు. గ్రామంలోని మరికొంత మంది సోమవారం అదే ఆవరణలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు గుంతలు తీశారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో మొహన్‌లాల్ సమాచారంతో పాటు, అదే విధంగా 100 కాల్ సమాచారం మేరకు అచ్చంపేట సీఐ ఉప్పునుంతల ఎస్సై వెంకట్‌రెడ్డి, పలువురు సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. అంబేడ్కర్ విగ్రహం నిర్వాహకులతో పాటు ఛత్రపతి శివాజీ విగ్రహం నిర్వాహకులతో గ్రామ పెద్దల సమక్షంలో సీఐ రవీందర్, వెంకట్‌రెడ్డిలు చర్చించారు. కలెక్టర్ అనుమతి తర్వాతనే విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చట్టాన్ని ఉల్లంఘించి విగ్రహాలు ఏర్పాటు చేస్తే శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. అంతకు ముందు విగ్రహాల కోసం తీసిన గుంతలను పోలీసులు జేసీబీతో పూడ్చించారు.